# సాంత్వన

మనిషి....

- కష్టాల కడలిలో కొట్టుకుపోతున్నప్పుడు కాస్త నిలదొక్కుకునే 'ఆసరా' కోసం వెదుకుతాడు!

- యాంత్రిక జీవితంలో అలసిపోయినప్పుడు అది అరక్షణమైనా సరే 'ఉల్లాసం' కావాలనుకుంటాడు !

- అనారోగ్యంతో మూలుగుతున్నప్పుడూ, ఓటమితో కుంగిపోతున్నప్పుడు తన అక్కున తీసుకుని 'సేద' దీర్చే మనిషిని కోరుకుంటాడు.

మనకత్యంత ప్రియమైన వాళ్ళని కోల్పోయి - 'ఆ మనిషి ఇక కన్పించడు' అనే వూహ వచ్చినపుడు గుండెల్లోంచి దుఃఖం తన్నుకు వస్తుంది. అప్పుల రాకతో కట్టలు తెంచుకుని కన్నీళ్ళ రూపంలో బయటికి వస్తుంది !

కొంతమంది మనుషులు కన్నీళ్ళతో తమ బరువును దించుకోచూస్తే - కన్నీళ్ళని గుండెల్లోనే చిక్కబట్టుకొని గరళకంఠులవుతారు మరి కొందరు !

అలాంటి విషాద సమయాల్లో మనం ఏడిస్తే  నవ్వుదామని చూసే కొంతమంది శాడిస్టుల కంటికి మన కన్నీళ్ళనీ, దుఃఖాన్నీ కన్పించనీకుండా రక్షక కవచంలా నిలబడే చలువ కళ్ళద్దాలే కొన్నిసార్లు సాటి మనుషుల కపటపు పలకరింపులకన్నా ఎనలేని 'సాంత్వన' నిస్తాయి.

మనకిష్టంలేని నాయకులు మరణించినపుడు సానుభూతి ప్రకటించి ఆ కుటుంబ సభ్యులకు 'ఉపశమనం' కల్గించకపోతే పోనీ గానీ, చాటుమాటుగా 'అమ్మయ్య ! చచ్చాడు - పీడా వదిలింది!' అంటూ స్వీట్లు పంచుకోవటం, జోకులేసుకోవటం మన పైశాచిక ప్రవృత్తిని ప్రస్ఫుటం చేస్తుంది.

ఏదేమైనా - మన పరిచయస్తులు తమ ఆప్తుల్ని కోల్పోయి -పుట్టెడు దుఃఖంతో బాధపడ్తూన్న సమయంలో... మన 'పరామర్శ' మండే హృదయాలకి శీతలపవనంలా సోకి 'ఊరట' కలిగించాలే తప్ప - పుండు మీద కారం చల్లినట్టో - వేసని కాలపు వడగాల్పులా ఈడ్చీడ్చి కొట్టినట్టో ఉండకూడదు !

1-3-1996